



గ్రేటర్‌లో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 40.3, కనిష్ఠం 27.2 డిగ్రీలు, గాలిలో తేమ 20 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. -సిటీబ్యూరో

నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 6 ఏప్రిల్ 2024 | HYDERABAD

## మత్తుకు అలవాటుపడి..



సిటీబ్యూరో: డ్రగ్స్‌కు అలవాటు పడి, మత్తు పదార్థాలు సరఫరా చేయడమే ప్రవృత్తిగా మార్చుకున్న ఓ వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ. 2.45 లక్షల విలువ చేసే 15 గ్రాముల ఎండీఎంఏ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...గుంటూరు జిల్లాకు చెందిన పొదిల జైచంద్‌కు ప్రకాశం జిల్లాకు చెందిన సోహన్ అలియాస్ శ్రీధర్ పరిచయమయ్యాడు. సోహన్ బెంగళూరు కేంద్రంగా డ్రగ్స్ సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో మాదకద్రవ్యాలకు అలవాటు పడిన జైచంద్.. సులభంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొన్నాడు. ఈ క్రమంలో సోహన్ వద్ద ఎండీఎంఏను కొనుగోలు చేయడం ప్రారంభించాడు. గత నెల 26న బెంగళూరులో అతడి వద్దే 20 గ్రాముల ఎండీఎంఏను కొని.. నగరానికి వచ్చాడు. అందులో నుంచి 5 గ్రాముల ఎండీఎంఏను సేవించిన జైచంద్.. మిగిలిన వాటిని విక్రయించేందుకు యత్నిస్తున్నాడు. సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు సన్‌సిటీ, పీ అండ్‌టీ కాలనీలోని జైచంద్ ఇంటిపై దాడులు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి..డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# ట్యాంకర్ ట్రాకింగ్!



- ఎప్పుడొస్తుందో వినియోగదారుడికి తెలుసుకునే వీలు
- ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెస్తున్న జలమండలి
- ట్యాంకర్లు పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు
- రియల్ టైం ట్రాకింగ్ విధానంతో అక్రమదందాకు చెక్

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : వాటర్ ట్యాంకర్ల సరఫరాలో అక్రమాలకు చెక్ పెడుతూ జలమండలి కీలక నిర్ణయం తీసుకున్నది. గాడి తప్పుతున్న ట్యాంకర్‌ను ట్రాకింగ్‌లోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. వినియోగదారుడికి అత్యంత పారదర్శకంగా ట్యాంకర్ నీటిని చేర్చేలా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నది. ప్రస్తుతం వాటర్ ట్యాంకర్‌కు యమ డిమాండ్ ఉన్నది. ఇదే అదునుగా కొందరు ట్యాంకర్ నీటిని పక్కదారికి మళ్లిస్తూ అక్రమ దందాకు తెరలేపారు. ఈ నేపథ్యంలో రియల్ టైం ట్రాకింగ్ విధానాన్ని అమలు చేసి వాటర్ ట్యాంకర్ నీటిని సక్రమంగా అందించే చర్యలకు జలమండలి ఉపక్రమించింది. ఇందులో భాగంగానే పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో ఈ ట్రాకింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రాబోయే వారం రోజుల్లోగా 75 ఫిల్లింగ్ స్టేషన్లలో సైతం ట్రాకింగ్‌లోకి వాటర్ ట్యాంకర్లను తీసుకొస్తామని ఐటీ విభాగం అధికారులు తెలిపారు. సంస్థ పరిధిలో ఉన్న 700 ట్యాంకర్లను ట్రాకింగ్‌లోకి తీసుకొచ్చి ఉబర్, ఓలా తరహాలో వాహనం ఏ సమయంలో ఎక్కడ ఉంది? ఎంతసేపటిలో ట్యాంకర్ ఇంటికి చేరుతుందో వినియోగదారులు తెలుసుకునేలా పారదర్శక సేవలు అందించనున్నట్లు వెల్లడించారు.

## నీటి పంపిణీలో ఆటంకం ఉండొద్దు

### పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా



క్షేత్రగిరి గుట్టపై మిషన్ భగీరథ ట్యాపింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా

మేడ్చల్ రూరల్, ఏప్రిల్ 5 : నీటి పంపిణీలో ఎలాంటి ఆటంకం జరుగకుండా చూడాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. తాగు నీటి సరఫరా కోసం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మేడ్చల్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామ శివారు క్షేత్రగిరిగుట్టపై ఉన్న మిషన్ భగీరథ మేడ్చల్ సెగ్మెంట్ ట్యాపింగ్ పాయింట్‌ను శుక్రవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి సందర్శించారు. పాయింట్ వద్దకు వస్తున్న నీటి వివరాలు, జలాలను ఎలా పంపిస్తున్నారనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పాయింట్ వద్దకు చేరుకుంటున్న నీటి పంపిణీలో ఎలాంటి ఆటంకం, సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా సమయానుకూలంగా నీటిని పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ విజయ్ ప్రకాశ్, ఎస్ఈ శ్రీనివాస్ చారీ, ఈఈ నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి సమయాల్లో ఎక్కువ ట్యాంకర్లు డెలివరీలు చేయాలి

### ఫిల్లింగ్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీలో జలమండలి ఎండీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : జలమండలి డివిజన్ -6 పరిధిలోని పలు ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లను శుక్రవారం ఎండీ సుదర్శన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్లారెడ్డి గూడ, ఎర్రగడ్డ, ఫతేనగర్, ఎస్‌ఆర్‌నగర్-1, 2, బోరబండ ఫిల్లింగ్ స్టేషన్లను పరిశీలించారు. ట్యాంకర్ బుకింగ్స్ డెలివరీ రికార్డ్స్‌ను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. బుకింగ్ లాగ్‌బుక్స్‌ను పరిశీలించారు. ట్యాంకర్ డెలివరీల్లో ఆలస్యం చేయవద్దన్నారు. బుకింగ్స్ అయిన తర్వాత సాధ్యమైనంత త్వరగా డెలివరీ చేయాలన్నారు. పెండెన్సీ లేకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. వాణిజ్య వినియోగదారులకు రాత్రి సమయాల్లో ఎక్కువ ట్యాంకర్ డెలివరీలు చేస్తే.. పెండెన్సీ లేకుండా చూడవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం హరిశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## వీ లవ్ ధోని! మార్మోగిన ఉప్పల్

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) :'వీ లవ్ ధోని.. వీ లవ్ ధోని' నినాదాలతో ఉప్పల్ స్టేడియం మార్మోగింది. శుక్రవారం ఉప్పల్ వేదికగా సన్ రైజర్స్- హైదరాబాద్-చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ప్రత్యేకించి ధోని గేమ్‌ను వీక్షించేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. మ్యాచ్ ప్రారంభానికి ముందే ఎండను సైతం లెక్క చేయకుండా క్యూలైన్లో నిల్చొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచే స్టేడియం లోపలికి అనుమతించారు. ఫ్యాన్స్ హంగామాతో ఉప్పల్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. మరోవైపు ఐపీఎల్ టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారంటూ క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెయ్యి రూపాయల టికెట్‌ను రూ.6వేలకు పైగా విక్రయించారని ఆరోపించారు.



ముషీరాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, చిత్రంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

## గెలుపే లక్ష్యంగా

# గులాబీ సత్తాచాటేలా..

### సమన్వయ సమావేశాలతో బీఆర్ఎస్ దూకుడు





సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : లోకసభ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ దూకుడు పెంచింది. మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్ ప్రచారంలో జోరు పెంచారు. ప్రజాప్రతినిధులతో కలిసి రోజుకో నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. వాకర్స్‌తో సమావేశాలు, నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు శ్రేణులతో సమన్వయ సమావేశాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇలా బీఆర్ఎస్ అభ్యర్థులు ముందంజలో ఉంటే..బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కనీస ప్రచారంలో లేరు. దీంతో ఆ రెండు పార్టీల్లోనూ స్తబ్ధత నెలకొన్నది. మొత్తంగా లష్కర్‌పై గులాబీ జెండా ఎగురవేయడంతో పాటు మల్కాజిగిరి స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా బీఆర్ఎస్ ప్రణాళికాబద్ధంగా కార్యాచరణతో క్యాంపెయిన్ చేస్తున్నది. ఇందులో భాగంగానే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ నేతలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, సనత్‌నగర్, ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ఇప్పటికే జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో సమన్వయ సమావేశాలను నిర్వహించారు. శనివారం సనత్‌నగర్‌లో, 7న ఖైరతాబాద్, 8న నాంపల్లి, 10న అంబర్‌పేట నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడంతో పాటు ప్రజాక్షేత్రంలో గులాబీ సత్తా చాటేలా కార్యాచరణతో ముందుకెళ్తున్నారు.

# రాగిడిదే విజయం

### కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, చిత్రంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

బేగంపేట్, ఏప్రిల్ 5: మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలనిఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. శుక్రవారం బేగంపేట మయూరీ మార్గ్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. వీటితో పాటు బేగంపేట డివిజన్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలనూ పరిష్కరించినట్టు తెలిపారు. అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...కేసీఆర్ హయాంలో పదేండ్ల కాలంలో నగరంలో ఫ్లై ఓవర్లు, నాలాల అభివృద్ధి, ఐటీ రంగం, శాంతి భద్రతల పరిరక్షణ, సీసీ రోడ్లు, మురుగునీటి వ్యవస్థ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో అధికారంలో వచ్చి.. ఇప్పటివరకు రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

# హైదరాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేశాం

### సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

కవాడిగూడ, ఏప్రిల్ 5: సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్‌దేనని ఆ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు మద్దతుగా ముషీరాబాద్ నియోజక వర్గంలోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజక వర్గ బీఆర్ఎస్ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముందుగా పద్మారావు, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను బీఆర్ఎస్ శ్రేణులు గజ మాలలో ఘనంగా సత్కరించారు. అనంతరం భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పద్మారావు గౌడ్ మాట్లాడుతూ 14 ఏండ్లు కష్టపడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, హైదరాబాద్‌ను అనేక రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఇందిరాపార్కు నుంచి వీఎస్‌టీ వరకు స్టీల్ బ్రిడ్జిని నిర్మించినట్లు చెప్పారు. బస్తీ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయామని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచినీళ్లు, విద్యుత్ నిరంతరంగా ఉండేవని, కానీ నేడు తాగునీటి సమస్యలు తీవ్రంగా తలెత్తుతున్నాయన్నారు. ఒక్కసారి తనను ఆశీర్వదిస్తే.. అందరికీ అందుబాటులో ఉంటూ ఇక్కడి సమస్యలను పార్లమెంట్‌లో వినిపించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీతా ప్రకాశ్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్ రెడ్డి, ముఠా పద్మా నరేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎడ్ల హరిబాబు యాదవ్, రాష్ట్ర యువజన నాయకుడు ముఠా జైసింహ, వివిధ డివిజన్ల అధ్యక్షులు వల్లాల శ్యామ్ యాదవ్, ఎం. రాకేశ్ కుమార్, బల్లా శ్రీనివాస్ రెడ్డి, కొండా శ్రీధర్ రెడ్డి, నేతలు మాచర్ల పద్మజ, మహ్మద్ అలీ పాల్గొన్నారు.